క్లుప్తంగా...

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సహకరించండి

యాకుత్‌పురా: ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సహకరించాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్-07 డిప్యూటీ కమిషనర్ శైలజ సూచించారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మల ఇళ్ల కోసం దఖాస్తు చేసుకున్న వారికి సర్వే చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 19 శాతం సర్వే పూర్తి చేయగా జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు మరింత విస్తృతంగా నిర్వహించనున్నామన్నారు. సర్వేలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



పూజల్లో పోల్కం శ్రీనివాస్ గురుస్వామి, రాము యాదవ్ గురుస్వామి

అఫ్జల్‌గంజ్: అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ చైర్మన్ భక్తుల రాము యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా పడి పూజ, రాథయాత్ర వేడుకలు చేపట్టారు. పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి భజనలు భక్తిగీతాలతో ప్రాంతం మారుమోగింది. ఈ పూజలో టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ గురుస్వామి నిఖిల్ స్వామి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఠాకూర్ అమర్‌సింగ్, జె.రవీందర్, పరుశురామ్ తదితరులు

గోల్కొండ: దివంగత మాజీ సీఎల్పీ నేత పీజేఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గుడిమల్కాపూర్ చౌరస్తాలో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు జె.రవీందర్, పరశురామ్‌తో పాటు పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి, సమాజ సంక్షేమానికి పీజేఆర్ చేసిన కృషిని వారు కొనియడారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సంతోష్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రుమాన తెలిపిన వివరాల ప్రకారం..మాదన్నపేట్ రామచంద్రనగర్ కోహినూర్ ఫుట్‌పాత్‌పై ఈ నెల 26న ఉదయం 8 గంటల ప్రాంతంలో 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 26న మధ్యాహ్నం 2 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ మలుపు తిరిగిన ట్రాఫిక్ వివాదం

చార్మినార్: ట్రాఫిక్‌లో తలెత్తిన చిన్న వివాదం ఘర్షణకు దారి తీసింది. ఘాన్సీబజార్‌లోని బీజేపీ చార్మినార్ నియోజకవర్గం కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఈ వివాదం రాజకీయ మలుపు తిరిగింది. కొంతమంది యువకులు ఉద్దేశపూర్వకంగా బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు వైభవ్ శర్మతో పాటు కార్యకర్తలు, పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడినట్లు బాధితునితో పాటు సీనియర్ బీజేపీ నాయకురాలు మేఘారాణి అగర్వాల్ ఆరోపిస్తున్నారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని కోరుతూ ఆమెతోపాటు పలువురు బీజేపీ నాయకులు చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. శాలిబండ ప్రాంతానికి చెందిన నజీర్ (27)అనే వ్యక్తి పటేల్ మార్కెట్లో వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఘాన్సీ బజార్ మీదుగా కారులో వెళుతుండగా.. స్థానికంగా ఉండే బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు వైభవ్ శర్మతో వివాదం, ఘర్షణ జరిగింది. దీంతో నజీర్ వెంటనే తన స్నేహితులకు ఫోన్ చేసి పిలిపించుకొని దాడికి పాల్పడినట్లు బాధితుడు వైభవ్ శర్మ చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు.



ఘాన్సీ బజార్‌లో జరిగిన దాడి (ఫైల్)



చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రాజీ కోసం మజ్లిస్ నాయకుల ప్రయత్నం : మేఘారాణి అగర్వాల్

తాము కేసు నమోదు చేసి నిందితులను చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేస్తుండగా పత్తర్ ఘట్టి మజ్లిస్ పార్టీ కార్పొరేటర్‌తో పాటు స్థానిక నాయకులు రంగంలోకి దిగి రాజీ చేసే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ నాయకురాలు మేఘారాణి అగర్వాల్ అన్నారు. మా పార్టీ కార్యకర్తలపై దాడి చేయడమే కాకుండా కార్యాలయంపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి: పంకజ్ కుమార్ అగర్వాల్

బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడడమే కాకుండా నాయకులు, కార్యకర్తలను చితబాదిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ సంరక్షణ సమితి కుంభమేళా అగర్వాల్ బందు అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ డిమాండ్ చేశారు. నడి బజార్లో బహిరంగంగా నిందితులు దాడికి పాల్పడిన దృశ్యాలు సీసీ టీవీలో నమోదయాయన్నారు.

వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు చేయాలి

చార్మినార్: వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు చేయాలని చార్మినార్ మైదాన్ ఖాన్ చౌక్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు జలమండలి జనరల్ మేనేజర్ కృష్ణ నాయక్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయనను కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శృంగారం రమణాచార్యులు, భాగ్యనగర్ గణేశ్ సమితి కేంద్ర కమిటీ సభ్యులు ప్యారసాని వెంకటేష్‌తో కలిసి జనవరి 10న వైకుంఠ ఏకాదశి నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయని వారు తెలిపారు. ఉత్సవాల సమయంలో సర్దార్ మహల్ రోడ్డు, ఆలయ పరిసరాల్లో మురుగు నీరు రోడ్డుపై ప్రవహించకుండా చూడడం, డ్రైనేజ్ మాన్‌హోల్‌పై కొత్తగా మూతలు బిగించాలని జీఎంను కోరారు.



జీఎం కృష్ణ నాయక్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

తమ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినటు వారు తెలిపారు.

గౌలిపురా కబేళాను అందుబాటులోకి తేవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆరె కటిక సంఘం ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురాలోని మున్సిపల్ కబేళాను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని గౌలిపురా ఆరె కటిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఆరెక కటిక సంఘం నాయకులు, ప్రజలు ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇంబర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ..గౌలిపురా కబేళాను కబ్జా చేసిన వ్యక్తులతో కుమ్మక్కై రెవెన్యూ మున్సిపల్ అధికారులపై విచారణ జరిపించాలన్నారు. కబేళాలో కరెంటు, వాటర్, డ్రైనేజీ సౌకర్యాన్ని వెంటనే కల్పించాలన్నారు. గౌలిపురాలో నిజాం కాలం నుంచి కబేళా కొనసాగుతుందని..దీనిపై ఆరె కటిక, కురుమ గొల్ల, ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ తదితర ప్రజలు ఆధార పడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. 2003 డిసెంబర్ 31వ తేదీ నుంచి ఈ గౌలిపురా కబేళా మూత పడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆరె కటిక సంఘం అధ్యక్షుడు యు.యశ్వంత్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్, సంఘం ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం



అవార్డులు ప్రదానం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: రతన్ టాటా దేశ సంక్షేమానికి నిరంతరం కృషి చేశారని ఉస్మానియా తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తమ్ అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో రతన్ టాటా 86వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు, బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్లు, బిజినెస్ మేనేజర్ మేనేజ్‌మెంట్లలో సేవలందించిన వారికి రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్ మాట్లాడుతూ..ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం కోసం తొమ్మిది వేల కోట్లకు పైగా విరాళాలు అందించారని వివరించారు. తెలంగాణ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ.. రతన్‌టాటా తన జీవితంలో వ్యాపార విజయాన్ని సాధించడమే కాకుండా సామాజిక రంగంలో తన సహకారంతో ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నారన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ..40 ఏళ్లుగా చేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ కార్యదర్శి ఇట్టా ఉదయశ్రీ, ప్రోగ్రాం చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ రవితే, మేఘన, సబవత్ మీనాక్షి, బత్తుల హేమంత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఉత్సాహంగా ఫుడ్ డే



పాఠశాలలో సహపంక్తి భోజనాలు చేస్తున్న చిన్నారులు

గోల్కొండ: టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్‌లో శనివారం ఫుడ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఆడిపాడుతూ సందడి చేశారు. ఇంటి నుంచి ఫ్రూట్స్, స్నాక్స్ తెచ్చుకుని తమతోటి పిల్లలతో సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అమ్మాయిలు ర్యాంప్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. కలిసిమెలిసి ఉండడం ఒకే చోటు కూర్చొని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను పీపీ చిన్నారులకు నేర్పించడం జరుగుతుందన్నారు. సహపంక్తి భోజనాల వల్ల చిన్నారుల మధ్య ప్రేమాభిమానాలు వెల్లడవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీపీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న బింగో సర్కస్

లంగర్‌హౌస్: బింగో సర్కస్ లంగర్‌హౌస్‌లో మొదటిసారిగా ప్రదర్శిస్తుండగా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ వస్తుందని నిర్వాహకుడు సునీల్ చౌహాన్ అన్నారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద బింగో సర్కస్ ప్రదర్శనల విషయాలను నిర్వాహకులు విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాదాపు 114 మంది విదేశీ కళాకారులు సాహసోపేత ప్రదర్శనలతో అందరిని మంత్రముగ్దులను చేస్తున్నారన్నారు. ప్రతిరోజు 3 షోలు నిర్వహిస్తుండగా జిమ్మాయి జమ్ కామిడీతో పాటు 32 ప్రదర్శనలు చేయబడుతున్నాయన్నారు. ఈ ప్రదర్శనలు హృదయాలను కదిలించే విధంగా ఉండటంతో కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రదర్శనలు వీక్షిస్తున్నారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట, మూడు, రాత్రి 7 గంటలకు ప్రదర్శనలు ఉంటాయన్నారు.



ఘనంగా డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ జయంతి

నాంపల్లి: ధ్వన్యుకరణ సామ్రాట్, పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ 92వ జయంతిని పురస్కరించుకుని నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ప్రపంచ మిమిక్రీ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. శనివారం రాత్రి ఈ వేడుకలను చంద్రముఖి ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో చేపట్టారు. చంద్రముఖి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన వేడులకు మిమిక్రీ కళాకారులు శ్రీనివాస్, మనోజ్‌కుమార్, నందీశ్వరరావు, మల్ల రమేష్, శివ ప్రసాద్, రామకోటేశ్వరరావు, జి.రమేష్, అశోక్ కుమార్, సుబ్రహ్మణ్యం, హరి ప్రసాద్ వంటి ప్రముఖులు హాజరై కాసేపు అందరినీ నవ్వించారు. ఈ సందర్భంగా చంద్రముఖి చంద్రశేఖర్ మాట్లాడుతూ..తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం చంద్రముఖి ఫౌండేషన్‌ను నెలకొల్పినట్లు వివరించారు. మిమిక్రీ కళాకారులకు ఎలాంటి సమస్య తలెత్తినా తాను నెలకొల్పిన సంస్థను సంప్రదించాలని కోరారు. మల్లం రమేష్ మాట్లాడుతూ.. డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ అందరికి ఆదర్శం అన్నారు. ఆయన అడుగు జాడల్లోనే నడుచుకుంటూ కళను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మిమిక్రీని ప్రదర్శించిన యువ కళాకారులకు అవార్డులను అందజేశారు.



అవార్డులు అందుకున్న కళాకారులతో చంద్రముఖి చంద్రశేఖర్, మల్లం రమేష్, శివ ప్రసాద్

నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభు లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నూతన పాలక మండలి శనివారం కొలువుదీరింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఈఓ శివరుద్రప్పలు నూతన సభ్యులు ఎ.మహేష్ గౌడ్, బి.వందన, రాయల విజయలక్ష్మీ, ఏదుళ్ల శ్రీధర్, కరన్‌కోట్ శైలేష్‌ను ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ..ప్రస్తుతం కొలువుదీరిన పాలక మండలి గడువు ఏడాది కాలం ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు కలిసి చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు నియమితులయ్యారని తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే ఆలయ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.



చురుగ్గా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

గోల్కొండ: గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చురుగ్గా జరుగుతుంది. శనివారం అధికారులు ఇంటింటికీ తిరిగి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సర్వే అధికారి మహ్మద్ పర్వేజ్ దరఖాస్తు దారుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఇళ్లు, ఆధార్ వివరాలు, ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు తదితర వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మజ్లిస్ నయాకీలా ఏరియా కమిటీ అధ్యక్షుడు సిరాజ్‌ఖాన్ పటేదార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ సూచనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి అందరి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకుడు అన్వర్‌ఖాన్ తదితరులున్నారు.



ముమ్మరంగా టూంబ్స్ చౌరస్తా సుందరీకరణ పనులు



గోల్కొండ: సెవన్ టూమ్స్ చౌరస్తా సుందరీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొంత కాలంగా వాహనాల రాకపోకలతో ఈ చౌరస్తా రద్దీగా మారింది. పర్యాటక ప్రాంతాలైన కుతుబ్‌షాహీ సమాధుల ప్రాంగణం, గోల్కొండ కోటకు వెళ్లే రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఈ చౌరస్తా గుండానే రాకపోకలు సాగిస్తాయి. ట్రాఫిక్ తీవ్రతను తగ్గించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి చౌరస్తా వద్ద మోడ్రన్ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పనులు కూడా జరుగుతున్నాయి. దీనికి తోడు హెరిటేజ్ మాడ్రన్ స్ట్రీట్ లైట్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.



31న అయ్యప్ప స్వామి పడిపూజ

గౌలిపురా: హనుమాన్‌నగర్‌లో ఈ నెల 31న ఉదయం 6 గంటలకు గణపతి హోమం, మధ్యాహ్నం 12.30 గంటలకు అయ్యప్ప స్వామి పడి పూజ, పడి హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, కన్నెస్వామి డి.క్రాంతి కుమార్ తెలిపారు. డి.గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రికి దంత వైద్యుడు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న దంత వైద్యుడి పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. కొన్ని నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా గోల్కొండ ఆసుపత్రిలో విధులు నిర్వహించి దంత వైద్యులు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. అయితే ఇటీవలే డాక్టర్ రాకేష్‌కుమార్ బదిలీపై తమ ఆసుపత్రిలో జాయిన్ అయ్యారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాస్‌రావు తెలిపారు. దీంతో తమ ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నారని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



అజయ్‌సింగ్ లోధ్ (ఫైల్)

అబిడ్స్: ధూల్‌పేట్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు, లోధ్ సదర్ పంచాయతి సమాజ్ సభ్యుడు అజయ్‌సింగ్ లోధ్ (54) కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉండి శనివారం తుదిశ్వాస విడిచారు. అతని నివాసానికి గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్, పప్పుమాత్రే, పలు పార్టీల నేతలు తరలి వచ్చి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అతని సోదరుడు బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఆనంద్‌సింగ్ లోధ్‌తో పాటు కుటుంబసభ్యులు అతని అంత్యక్రియలు నిర్వహించారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఆర్.చంద్రమోహన్



స్వాధీనం చేసుకున్న కత్తులు, తుపాకి, ఫోన్లు

జియాగూడ: హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దారి దోపిడీ, ఆస్తి, హత్య నేరాలతో సంబంధం ఉన్న ముగ్గురిని అరెస్టు చేశారు. శనివారం కుల్సుంపురా స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఆర్.చంద్రమోహన్, కుల్సుంపురా ఏసీపీ మహ్మద్ మునావార్, ఇన్‌స్పెక్టర్ సునిల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 24న వేకువజామున గుడిమల్కాపూర్ మహేష్‌నగర్ కాలనీకి చెందిన ఆర్.కృష్ణ(33) తన ద్విచక్ర వాహనంపై కూలిపని నిమిత్తం బయటకు వెళ్లి వస్తుండగా 100 ఫీట్ల జాతీయ రహదారి ప్రాంతంలో రాజేంద్రనగర్‌లోని ఖయ్యూమ్‌నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ హస్సన్(32), యాకత్‌పురా ప్రాంతానికి చెందిన సయ్యద్ తాలేబ్ అలీ(23), ఖయ్యూమ్‌నగర్‌కు చెందిన సైఫ్ అలీ మీర్జా (19) అటకాయించి కత్తితో బెదిరించి కృష్ణ బండి తాళాలు, ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజేంద్రనగర్ చింతల్‌మెట్ ప్రాంతంలో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, కంట్రీ మేడ్ తపంచా, తుపాకి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యలకు, ఓ ఇంటి కబ్జా, లాంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీలకు పాల్పడినట్లు సుమారు 6 కేసులలో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్నాం'

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ ప్రజల మద్దతు, ప్రేమాభిమానాలతోనే రాజకీయాల్లో ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్, కార్వాన్ తదితర డివిజన్‌లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల వారిని కలుసుకోని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతోనే మూడవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి తాను చుపుతున్న చొరవ వల్ల అన్ని వర్గాల ప్రజలు తనను ఆదరిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్ తదితరులు



ఉప్పుగూడ రైల్వేస్టేషన్ చౌరస్తా వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న పులిపాటి రాజేష్ కుమార్

అబిడ్స్: మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణ నేత, మహా మేధావి దివంగత మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. శనివారం గృహకల్పలోని సంఘం కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..90వ దశకంలో కూడా అనుక్షణం దేశంకోసం పరితపించిన మహోన్నత వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని అన్నారు. కేఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, శ్రీధర్, శంకర్, రహీం, శ్రీరాజు, శ్రీకృష్ణ, అయోధ్య, వరప్రసాద్, మహేందర్, నజీర్, జహంగీర్, మహ్మద్ వహీద్, ముస్తఫా పాల్గొన్నారు.

దూద్‌బౌలి చౌరస్తాలో..

దూద్‌బౌలి: మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. దూద్‌బౌలి చౌరస్తాలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి 2 నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కన్నయ్య లాల్, భాను చందర్ యాదవ్, హమీద్ ఉద్దీన్, నసీర్ ఫరూఖీ, మహమ్మద్ భారీ, గంగపుత్ర ప్రవీణ్, యువజన కాంగ్రెస్ నాయకులు కుమారి జ్యోతి శెట్టి, మహమ్మద్ బిలాల్, రామకృష్ణ, అహ్మద్ పాల్గొన్నారు.

చార్మినార్ వద్ద..

చార్మినార్: చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో శనివారం సంతాప సభ జరిగింది. మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. అలాగే మాజీ సీఎల్పీ నాయకుడు పి. జనార్దన్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని చార్మినార్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కన్నయ్య లాల్, జి.ఆనంద్, వెంకటేష్ ముదిరాజ్, పులిపాటి రాజేష్ కుమార్, కాశమోనీ శ్యామ్ రావు ముదిరాజ్, మూసా కాశీం, ఎం కృష్ణ కుమార్, జి దినేష్ కుమార్, హమీర్ అలీ, అబ్దుల్ బారి, భానుచందర్ యాదవ్ తదితర పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి..

గౌలిపురా: ఉప్పుగూడ రైల్వేస్టేషన్ చౌరస్తా వద్ద శనివారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మన్మోహన్ సింగ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా అసెంబ్లీ ఎ-బ్లాక్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాస్, యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రవిరాజ్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు రాకేశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్, డల్లు శివ, బండి నరేశ్, ద్వారాకు అనిల్, మహ్మద్ ఇస్మాయిల్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నళిని గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధ్యక్షులు శశి యాదవ్, పవన్ కల్యాణ్ యాదవ్, సాయి యాదవ్, లడ్డూ పటేల్, మాజీద్ పాషా, దినేశ్, నవీన్ పటేల్, చిన్న పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273